

అప్పనపల్లి మొల్లేటివారిపాలెంలో రోడ్డుపై చేరిన వరదనీరు


పాశర్లపూడిబాడవలో ముంపునకు అప్పనపల్లి కాజ్‌వే


ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య కాజ్‌వే పై ప్రజల రాకపోకలు కోసం అందుబాటులో ఉంచిన పడవలు


అప్పనరామునిలంక నుంచి టేకిశెట్టిపాలెం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో వరదనీరు


ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే పై నిలిచిన వరద

క్లుప్తంగా

ముగిసిన మొహర్రం


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: కర్బలా పుణ్యభూమిలో అసువులు బాసిన హజరత్ ఇమామ్ హుస్సేన్‌తో పాటు అతని పరివారానికి మామిడికుదురు, నగరం గ్రామాలకు చెందిన ముస్లింలు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. రెండు నెలల ఎనిమిది రోజులు నిర్వహించిన మొహర్రం సంతాప కార్యక్రమాలు ముగింపులో భాగంగా మామిడికుదురు ఇమామ్ అలీ రజా పంజాలో మాతం జరిగింది. అనంతరం మామిడికుదురు, నగరం గ్రామాల్లోని అన్ని పంజాల్లో మాతం నిర్వహించారు. ఇమామ్ అలీ రజా పంజా ముతవల్లి సయ్యద్ రజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. మౌలానా సయ్యద్ అబ్బాస్ బాఖరి కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సందేశం ఇచ్చారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

పరిశుభ్రంగా గ్రామాలు


మాచవరంలో దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న అధికారులు

సాక్షి ఇంపాక్ట్

అంబాజీపేట: మండలంలో మాచవరం, కె.పెదపూడి గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. 'సాక్షి' దినపత్రికలో ఈ నెల ఒకటో తేదీన అధ్వానంగా పారిశుధ్యం శీర్షికన కథనం ప్రచురితమైంది. దాంతో డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో పంచాయతీ కార్మికులతో పారిశుధ్య పనులు చేపట్టారు. మాచవరంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్వర్యంలో దోమలు నిల్వ నివారణకు ఆయిల్ బాల్స్‌ను పిచికారి చేయించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో కె.సూర్య నారాయణ సోమవారం తెలిపారు. ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


సహకార సంఘం సమావేశం

అలమూరు: సహకార రంగాన్ని పూర్తిస్థాయిలో కంప్యూటరైజ్ చేయడంతో బ్యాంకింగ్ వ్యవస్థ సైతం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్ డివిజనల్ సహకార అధికారి డి.రాంబాబు రైతులకు సూచించారు. అలమూరు బొబ్బా చినవీరన్న సహకార సంఘంలో అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ కుమార్ అధ్యక్షతన సహకార వ్యవస్థలో కంప్యూటరైజేషన్‌పై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార అధికారి రాంబాబు మాట్లాడుతూ సహకార రంగంలో కేవలం వ్యవసాయరంగానికి సంబంధించిన సేవలనే కాకుండా బ్యాంకింగ్ తదితర సేవలను అందుబాటులోనికి తీసుకువచ్చామన్నారు. వీటిని రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆయన సూచించారు. రైతులకు అన్ని రకాల సేవలను అందుబాటులోనికి తీసుకురావడానికి ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సదస్సులో పాలకవర్గ సభ్యులు రామానుజనుల ప్రకాష్ గుడాల నాగ వెంకట్రావు, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్, సూపర్‌వైజర్ వి.ప్రదీప్, సహకార సంఘం సీఈవో బొబ్బా రామ సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఎ.శింగుబాబు, రాజా, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం

రాజోలు: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా కడలిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. పార్టీ నాయకుడు ఉలిశెట్టి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపుతోపాటు పలువురు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ జ్ఞాపికలను అందజేశారు.

సురేష్‌కుమార్ కృషి అభినందనీయం

అమలాపురం రూరల్: ఉద్యోగ జీవితమంతా జిల్లాలో క్రీడల అభివృద్ధికి, యువతలో క్రీడా స్ఫూర్తి పెంచి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ప్రోత్సహించడానికి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పీఎస్ సురేష్‌కుమార్ కృషి చేశారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆయన సేవలను కీర్తించారు. సురేష్ కుమార్ ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ సోమవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.

జలదిగ్బంధంలో లంక గ్రామాలు

- పెరిగిన గోదావరి వరద ఉధృతి
- అప్పనపల్లి కాజ్‌వేపై రాకపోకల నిషేధం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతి మరింత పెరిగింది. లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారులను వరద నీరు ముంచెత్తింది. దీంతో తీర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పనపల్లి కాజ్‌వే నీట మునిగింది. దీనిపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. నాలుగడుగుల మేర వరదనీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలను నిలిపి వేశారు. ఆర్టీసీ సర్వీసును రద్దు చేశారు. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మామిడికుదురు చివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువ నుంచి అప్పనపల్లి వెళ్లే రోడ్డు ముంపులో చిక్కుకుంది. దీంతో పాటు పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లోని మత్స్యకార కాలనీలను వరద నీరు చుట్టుముట్టింది. పెదపట్నం మధ్య లంక పూర్తిగా ముంపు భారిన పడింది. లంక గ్రామాల్లోని కూరగాయల తోటలు, కొబ్బరి తోటలు ముంపు భారిన పడ్డాయి. అప్పనపల్లి స్నానాల రేవులో అమృతలింగేశ్వరస్వామి విగ్రహం పూర్తిగా మునిగిపోయింది. గరుత్మంతుడి విగ్రహం సగం వరకు మునిగింది.

లంక గ్రామాల్లోకి వరద నీరు

సఖినేటిపల్లి: ధవళేశ్వరం వద్ద మొదటి వరద ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో సోమవారం మండల పరిధిలోని లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోను, రోడ్లు పైకి వరదనీరు చేరింది. ఎగువన వరద ఉధృతి తగ్గుముఖం పట్టినప్పటికీ దిగువకు వస్తున్న వరద నీటి ప్రవాహంతో లంక గ్రామాల్లో వరద నీటి మట్టం పేరుగుతోంది. ప్రధానంగా అప్పనరామునిలంకలో లోతట్టు ప్రాంతాలను, ప్రధాన రహదారులను ముంచెత్తింది. అప్పనరాముని లంక నుంచి టేకిశెట్టిపాలెం వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. టేకిశెట్టిపాలెం సరిహద్దులో గోదావరి పాయపై కొత్తగా నిర్మించిన కాజ్ వేకు సమాంతరంగా వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో ప్రజల రాకపోకలు బంద్ అయ్యాయి. ఇక్కడ గోదావరి పాయను అనుకుని ఉన్న అగ్నికుల క్షత్రియుల కాలనీ చుట్టూ వరద నీరు చేరింది. అప్పనరామునిలంకలో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఇక్కడి ప్రజలు ప్రత్యామ్నాయం మార్గంగా రామరాజులంక మీదుగా రాజోలు వైపునకు రాకపోకలు సాగిస్తున్నారు. అప్పనరామునిలంక నుంచి సఖినేటిపల్లి వైపు పోవు రహదారి కూడా వరద ముంపులోఉంది. ఇక్కడ రెండు గ్రామాల సరిహద్దులో గతంలో నిర్మించిన కాజ్ వేపై వరద నీరు ప్రవహిస్తోంది. సఖినేటిపల్లి లాకుపేట వద్ద నివాస గృహాల వద్దకు వరద నీరు చేరింది. అలాగే సఖినేటిపల్లిలంకలో వశిష్ఠ గోదావరినదిని ఆనుకుని సఖినేటిపల్లి రేవు వద్ద ఉన్న నివాస గృహాల వద్దకు నీరు చేరింది. వరద ఉధృతి తరుణంలో రేవులో ముందస్తుగా పంటు రాకపోకలను అధికారులు నిలుపుదల చేశారు.


అప్పనపల్లిలో గోదావరిలో ఒరిగిన కొబ్బరి చెట్లు

నిలకడగా వరద ఉధృతి

పి.గన్నవరం: జిల్లాలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి నిలకడగా కొనసాగుతోంది. ఈ ఏడాది మూడుసార్లు వచ్చిన వరదలతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆ గ్రామాల ప్రజలు నెల రోజుల నుంచి పడవలపై ప్రయాణిస్తున్నారు. బూరుగులంక రేవుకు వెళ్లే దారిలో ఏటిగట్టు దిగువన సీసీ రోడ్డు కూడా నీట మునగడంతో అవస్థలు తప్పలేదు. మానేపల్లి శివారు శివాలయ లంకకు వెళ్లే రహదారి వరదనీట మునిగిపోవడంతో ప్రజల రాకపోకల కోసం ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. అలాగే కోనసీమ జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై వెళ్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే మునిగిపోవడంతో ఆ గ్రామ ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. లంకల నుంచి ఏటిగట్లపైకి తరలించిన పశువులకు మేత లేకపోవడంతో లంక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నిలకడగా వరద

అయినవిల్లి: వరద ఉధృతి నిలకడగా ఉంది. మండలంలోని ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే పై సోమవారం కూడా పడవలపై లంక ప్రజలు రాకపోకలు కొనసాగాయి. రెవెన్యూ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలైన అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. పడవలను ఏర్పాటు చేసి వారికి నిత్యావసరాలను అందించారు. వరద బాధితుల కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బంది, వైద్య సిబ్బంది, మత్స్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు సహాయ చర్యలు చేపడుతున్నారు. ముక్తేశ్వరం వృద్ధగౌతమిపాయ(తొగరపాయ)లో వరద ఉధృతి కొనసాగుతోంది. పాత వంతెనపై వరదనీరు ఐదు అడుగులు దాటి ప్రవహిస్తోంది. వీరవల్లిపాలెం అయినవిల్లిలంక, పోట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. ఈ సారి పలు మార్లు తమ పంటలను వరద ముచ్చెంత్తిందని, తమను ఆదుకోవాలని లంక రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అదే విధంగా వరద వల్ల తమకు జీవనోపాధి లేకుండా పోయిందని మత్స్యకారులు లబోదిబో మంటున్నారు.


బూరుగులంక నుంచి వరదనీటిలో వస్తున్న విద్యార్థులు

రహదారులను ముంచెత్తిన వరద


వాకలగరువులో ముంపునకు గురైన కొబ్బరి తోటలు

అంబాజీపేట: వరద పోటెత్తడంతో వైనతేయి గోదావరి సోమవారం ఉధృతంగా ప్రవహించి గ్రామాల్లో ఉండే కౌశికలు పొంగిపొర్లడంతో రహదారులు, కొబ్బరి తోటలు నీట మునిగాయి. నందంపూడి, వాకలగరువు, తొండవరం గ్రామాల్లో ఇళ్లు, కొబ్బరి, అరటి, దొండ పాదులు నీట మునిగాయి. గోదావరి సమీపంలో ఉన్న కౌశికలోకి వరద నీరు చేరుతుంది. నందంపూడి బొంతువారి పేటలో ఆరు ఇళ్లు నీట మునిగాయి. తొండవరం రజకపేటకు వెళ్లే ప్రధాన రహదారి నీట మునగడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాకలగరువులో ఉన్న కొబ్బరి తోటలు వరద నీటికి ముంపునకు గురయ్యాయి.


చాకలిపాలెం శివారు కనకాయలంకకు పడవపై వెళ్తున్న ప్రజలు

బైబై గణేశా!


అంబాజీపేట కేవీ పాలెంలో గణపతిని ఊరేగిస్తున్న యువకులు, స్థానికులు

అంబాజీపేట: వినాయకచవితి నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట మండలంలో చలవ పందిర్లి వద్ద ఆదివారం గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న యువ గణపతిని, కె.పెదపూడిలో ఉన్న వినాయకుడ్ని నిమజ్జ ఊరేగింపును యువకుల కేరింతల నడుమ నిర్వహించారు.

నేదునూరులో..

అయినవిల్లి: నేదునూరు గ్రామంలో గణపతి నిమజ్జనం ఘనంగా జరిగింది. నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో రావిఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను మంగళవాయిద్యాలు, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామివారిని ట్రాక్టర్ పై ఉంచి ఊరేగించి సమీప పంట కాలువలో నిమజ్జనం చేశారు.


నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

వైభవంగా గణపతి హోమం

మామిడికుదురు: గణపతి నవరాత్రుల్లో భాగంగా మామిడికుదురు నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద సోమవారం శ్రీలక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. యాలి రామకృష్ణప్రసాద్, సుహాసిని, యింటి మహేంద్ర, శిరీష దంపతులు హోమంలో కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. వినాయకునికి కర్పూరంతో అర్చన చేశారు. ఆలయం వద్ద అన్నసమారాధన జరిగింది. భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

గంధం అలంకరణలో వరసిద్ధి వినాయకుడు

అంబాజీపేట: మాచవరం కోశి వారి అగ్రహారంలో ఉన్న వర సిద్ధి వినాయకుడు సోమవారం గంధం అలంకరంలో భక్తులకు దర్శనమిచ్చారు. అగ్రహారంలో ఉన్న భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉన్న వినాయకుని అర్చకులు డి.ప్రవీణ్ శర్మ మంచిగంధంతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.


మామిడికుదురు గణపతి హోమంలో పాల్గొన్న రాంబాబు, మహేంద్ర దంపతులు


గంధం అలంకరణలో దర్శనమిచ్చిన గణపతి

వాడపల్లి వెంకన్న ముఖద్వారం పనుల పరిశీలన

కొత్తపేట/రావులపాలెం: కోనసీమ ముఖద్వారం రావులపాలెం సెంటర్‌లో ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ముఖద్వారం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వాడపల్లి క్షేత్రానికి నిత్యం ముఖ్యంగా శనివారం రాష్ట్ర నలుమూలల నుంచీ అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్న విషయం తెలిసిందే. భక్తులకు స్వాగత ద్వారంగా వేంకటేశ్వరస్వామి దేవస్థానం ముఖద్వారం (ఆర్చ్‌గేట్)ను దాతల ఆర్థిక సాయంతో నిర్మించాలని దేవదాయ - ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ప్రతిపాదనకు సీఎంఆర్ సంస్థ ముందుకు వచ్చింది. సుమారు రూ.20 లక్షల వ్యయం అంచనాతో రావులపాలెం కళా వెంకట్రావు విగ్రహం సమీపంలో రింగ్‌రోడ్డు ప్రారంభంలో ఈ ఏడాది మే 19న డీసీ అండ్ ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో సీఎంఆర్ చైర్మన్ మావూరి వెంకటరమణ శంకుస్థాపన చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల అనుమతులు, సాంకేతిక ప్రక్రియలు అనంతరం పనులు ప్రారంభించారు. ఆ పనులను సోమవారం డీసీ అండ్ ఈఓ చక్రధరరావు పరిశీలించి, నిర్మాణ పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


వాడపల్లి దేవస్థానం ముఖద్వారం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీసీ అండ్ ఈఓ చక్రధరరావు

నత్తనడకన కేంద్ర ప్రభుత్వ పథకాలు

సఖినేటిపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు గ్రామాల్లో నత్తనడకన సాగుతుండడంతో వినియోగదారులు పలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ సోమవారం సఖినేటిపల్లి గ్రీవెన్స్‌లో బీజేపీ శ్రేణులు అర్జీని అందజేశారు. ఈ మేరకు అర్జీని ఎంపీడీవో కె.సూర్య నారాయణ, తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావులకు వారు ఇచ్చారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో అనేక గ్రామాల్లో ఇంక కేవైసీ ప్రక్రియ పూర్తికాకపోవడంతో లబ్ధిదారులకు కార్డులు అందడం లేదని తెలిపారు. ఈ రీత్యా రోగులు అత్యవసర వైద్య సేవలు అందుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం కేవైసీ ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని ఆ అర్జీలో వారు కోరారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)పథకం నత్తనడకన సాగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం తన వంతు మ్యాచింగ్ గ్రాంటును సకాలంలో మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, కార్యదర్శి బోణం నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్, సీనియర్ నేత చెంపాటి శివరామకృష్ణంరాజు, పట్టపు సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.


సఖినేటిపల్లి గ్రీవెన్స్‌లో అర్జీ ఇస్తున్న బీజేపీ శ్రేణులు

గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

డీఎం అండ్ హెచ్‌ఓ దుర్గారావు దొర


పాశర్లపూడిలంకలో గర్భిణికి అవగాహన కల్పిస్తున్న దుర్గారావు దొర

మామిడికుదురు: వరద ప్రభావిత గ్రామాల్లో గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డీఎం అండ్ హెచ్‌ఓ దుర్గారావు దొర పేర్కొన్నారు. ఆయన పాశర్లపూడిలంక శ్రీరామ్‌పేటలో సోమవారం పర్యటించారు. రెండు రోజుల్లో ప్రసవించనున్న కాటాడి ఆదిలక్ష్మితో మాట్లాడారు. తక్షణం ఆమెను అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించేలా అవగాహన కల్పించారు. అందుకు అవసరమైన బెడ్స్‌ను, వాహనాన్ని సిద్ధం చేయించారు. అక్కడ ఏర్పాటు చేసిన రెండు వైద్య శిబిరాలను పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ భరతలక్ష్మి, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఉన్నారు.

నేడు సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శన

కొత్తపేట: దక్షిణ భారతదేశంలో ప్రముఖ పౌరాణిక రంగస్థల కళాకారులుగా రాణిస్తున్న నటీ నటులతో మంగళవారం కొత్తపేట మండలం వాడపాలెంలో సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించనున్నారు. వాడపాలెం పాత మార్కెట్ గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ గనిశెట్టి చంద్రశేఖర్, సభ్యులు బందారు భాస్కరరావు, కురచ వెంకటేశ్వరరావు తెలిపారు. కళా పోషకులు, కళా ప్రోత్సాహకులు, కళాభిమానులు తరలివచ్చి నాటక ప్రదర్శనను జయప్రదం చేయాలని వారు కోరారు.

నిధుల్లేక.. మరమ్మతులు చేయక..

- శిథిలావస్థలో ఇరిగేషన్ క్వార్టర్లు
- అద్దె భవనాల్లో గడుపుతున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

అలమూరు: ఇరిగేషన్ సిబ్బంది క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. ఏళ్ల తరబడి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. నివాసం ఉండేందుకు వీలు లేకపోవడంతో ప్రస్తుతం ఇరిగేషన్ సిబ్బంది అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. జిల్లాలో తూర్పు, పశ్చిమ డెల్టా కాలువల పరిధిలోని ఇరిగేషన్ సిబ్బంది క్వార్టర్లు లేక ఇబ్బంది పడుతున్నారు. సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా లాకుల వద్ద నిరంతరం నీటి సరఫరాను నియంత్రించే ఇరిగేషన్ సిబ్బందికి ఈ అవస్థలు పరిపాటిగా మారాయి. బ్రిటిష్ వారి హయాంలో లాకుల వద్ద నిర్మించిన భవనాల మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో పూర్తిస్థాయిలో శిథిలస్థితికి చేరుకున్నాయి. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని ఆలమూరు మండలం చొప్పెల్ల, ఆత్రేయపురం మండలం లొల్ల, రావులపాలెం మండలం గోపాలపురం, కొత్తపేట మండలం వాడపాలెం, పలివెల వద్ద సాగునీటి వ్యవస్థ నియంత్రణకు లాకులు నిర్మించారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 40 వేల ఎకరాల భూమికి ఇరిగేషన్ శాఖ సాగునీరును అందించాల్సి ఉంది. సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది లాకుల వద్ద నివాసం ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాల్సి ఉంది. అయితే క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకుని నివాసయోగ్యంగా ఉండకపోవడంతో అక్కడ పని చేసే సుమారు 25 మంది సిబ్బంది సుదూర ప్రాంతాల్లో నివాసం ఉండడంతో సేవలకు తరచూ అంతరాయం ఏర్పడుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. సాగునీటిని వంతుల వారీ విధానంలో సరఫరా చేసే సమయంలో ఒక్కోసారి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని సిబ్బంది వాపోతున్నారు. క్వార్టర్స్ ఆధునీకరణ, నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో క్వార్టర్స్ ఎందుకు పనికి రాకుండాపోయాయి. దీనివల్ల నియోజకవర్గంలోని ఐదు లాకులు, రెండు ఎత్తిపోతల పథకాల వద్ద పరిశుభ్రత లేకపోవడంతో అడ్డూ అదుపు లేకుండా పెరిగే పిచ్చి మొక్కలు విషసర్పాలకు ఆవాసంగా మారింది.


చొప్పెల్ల లాకుల వద్ద శిథిలమైన క్వార్టర్స్

ఇరిగేషన్ శాఖను పట్టించుకోకపోవడంతో..

రైతుల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన లాకుల వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా ఇరిగేషన్ శాఖకు నిధులు మంజూరు చేయాలనే రైతుల నుంచి డిమాండ్ వ్యక్తమవుతుంది. ఇప్పటికే లాకుల వద్ద అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్న సమయంలో సిబ్బందికి అత్యవసరమైన క్వార్టర్స్ కూడా లేకపోవడం కూడా ఇరిగేషన్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందనే అభిప్రాయపడుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాలువ ఆధునీకరణ ప్యాకేజీలో క్వార్టర్స్‌ను నిర్మించాల్సి ఉన్నా తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతోనే ఇరిగేషన్ శాఖకు ఈ పరిస్థితి దాపురించిందని సిబ్బంది వాపోతున్నారు. నియోజకవర్గంలో గోపాలపురంలో మాదిరిగానే మినహా మిగతా చోట్ల క్వార్టర్స్‌ను తొలగించి కొత్త భవనాలను నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



ఇరిగేషన్ లాకుల వద్ద శిథిల స్థితికి చేరుకున్న పెంకుటిల్లులు స్థానే కొత్త భవనాలను నిర్మించేందుకు గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. క్వార్టర్స్ లేకపోయినా రైతులకు సమయానికి సేవలను అందించే విధంగా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.

– టి.కృష్ణ త్రిమూర్తులు, ఇరిగేషన్ ఏఈ, ఆలమూరు

టీబీని తరిమి కొట్టడమే లక్ష్యం


పాశర్లపూడిలంకలో టీబీ ముక్త భారత్ అభియాన్ పోస్టర్ల ఆవిష్కరణ

మామిడికుదురు: 2027 నాటికి టీబీని దేశం నుంచి తరిమి కొట్టడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యాధికారి లలిత పేర్కొన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం సోమవారం పాశర్లపూడిలంకలో జరిగింది. టీబీ లక్షణాలు, దాని నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రభుత్వం రూపొందించిన పోస్టర్లను సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్ ఆవిష్కరించారు. టీబీ అనుమానితులు విధిగా కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీని నిర్లక్ష్యం చేస్తే ఏడాదిలో మరో ఇద్దరు ఆరోగ్యవంతులకు ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. లక్షణాలు ఉన్న వారు వెంటనే ప్రభుత్వాస్పత్రి డాక్టరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమణ, సూపర్ వైజర్ చక్రదర్, హెల్త్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.